క్లుప్తంగా

సాలూరు నుంచి భద్రాచలం

ఆర్టీసీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు



డిపో మేనేజర్ బి.సూర్యనారాయణమూర్తి

సాలూరు: శ్రీరామనవమి సందర్భంగా సాలూరు నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ బి.సూర్యనారాయణమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన ఈ బస్సు ఏప్రిల్ 5న మధ్యాహ్నం 2 గంటలకు సాలూరు నుంచి బయల్దేరుతుందని పేర్కొన్నారు. 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు భద్రాచలం నుంచి తిరుగుప్రయాణం అవుతుందని తెలిపారు. భద్రాచలం వెళ్లాలనుకునే భక్తులు ముందుగా సర్వీసు నంబర్ 92581/92582తో రిజర్వేషన్ చేయించుకోవాలని సూచించారు.

మామిడి రామారావుకు ఎమ్మెల్సీ విక్రాంత్ నివాళులు



రామారావు పార్థివ దేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

బలిజిపేట: మండలంలోని గలావల్లి గ్రామానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది మామిడి రామారావు మృతి ఎంతో బాధాకరమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ మేరకు గలావల్లి గ్రామంలో రామారావు స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయనతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని, అటువంటి వ్యక్తి మనమధ్య లేకుండా పోవడమనేది మరవలేనిదన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు రుణాల మంజూరుకు చర్యలు



రుణ ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో పాల్గొన్న దరఖాస్తు దారులు

పార్వతీపురం రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం పార్వతీపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సిబ్బంది పరిశీలించారు. ఈ పరిశీలనలో వివిధ విభాగాలకు రుణాల మంజూరు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న 558 మంది దరఖాస్తు దారులు పాల్గొన్నారని ఎంపీడీఓ జీ.వెంకటరమణ మూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పరిధులకు సంబంధించిన బ్యాంకు అధికారులు పరిశీలించిన దరఖాస్తులపై ప్రాథమికంగా దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ స్టాపర్ల వితరణ



ట్రాఫిక్ స్టాపర్లను సీఐ కె.మురళీధర్‌కు అందజేస్తున్న వైభవ్ జ్యూయలర్స్ సిబ్బంది

పార్వతీపురం రూరల్: వైభవ్ జ్యూయలర్స్ యాజమాన్యం నాలుగు ట్రాఫిక్ స్టాపర్లను పట్టణ పోలీసుశాఖకు శుక్రవారం అందజేసింది. ఈ మేరకు ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ కె.మురళీధర్ పాల్గొని మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు తమ వంతు బాధ్యతగా ట్రాఫిక్ స్టాపర్లను వైభవ్ జ్యూయలర్స్ వారు వితరణ చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు, బందోబస్తు విధులకు స్టాపర్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సిబ్బందితో సీఐ మాట్లాడుతూ వాహన చోదకులు రోడ్డు నియమ నిబంధనలు తప్పకుండా పాటించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై పాపారావు, వైభవ్ జ్యూయలరీ బ్రాంచ్ మేనేజర్ గిరిబాబు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

పార్వతీపురం: పార్వతీపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఒక అంగన్వాడీ కార్యకర్త, రెండు అంగన్వాడీ సహాయకులు, ఒక మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మండలంలోని వీఆర్‌పేట అంగన్వాడీ వర్కర్ 1(ఓసీ), సీతంపేటలో మినీ అంగన్వాడీ కార్యకర్త (ఎస్టీ), చినబొండపల్లి-3లో అంగన్వాడీ సహాయకురాలు(బీసీ-డీ), బాలగుడబ-2లో అంగన్వాడీ సహాయకురాలు(ఎస్సీ) పోస్టులు ఉన్నాయన్నారు. ఆసక్తిగల అర్హులైన వివాహిత అభ్యర్థినులు, దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఈ రహదారికి మోక్షమెప్పుడో?



కల్వర్టు ప్రాంతంలో రాష్ట్రీయ రహదారిపై ప్రత్యామ్నాయంగా నిర్మించిన గోడ

పార్వతీపురం రూరల్:

జిల్లా కేంద్రం ప్రారంభంలో పార్వతీపురం మండల పరిధిలో గల శక్తినగర్ వద్ద ఉన్న రాష్ట్రీయ రహదారిపై ఉన్న కల్వర్టు గతేడాది కురిసిన భారీ వర్షాలకు కొంతభాగం కుంగి శిథిలావస్థకు చేరింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రమాదాలు జరగకుండా శిథిలావస్థకు గురైన భాగం వైపు ఓ గోడను ప్రత్యామ్నాయంగా నిర్మించారు. 7మీటర్ల వెడల్పు ఉన్న ఈ రహదారిపై గోడ నిర్మాణంతో కల్వర్టు ప్రాంతంలో ఐదు మీటర్ల వెడల్పును కుదించారు. దీంతో వచ్చిపోయే భారీ వాహనాలకు వన్‌వేగా ఆ ప్రాంతం మారిపోయింది. ఆదమరచి మితిమీరిన వేగంతో వచ్చిపోయే వాహనాలకు ప్రత్యామ్నాయంగా నిర్మించిన గోడ ప్రమాదాలకు దారి తీసే విధంగా దర్శనమిస్తోంది. ఏడాది కాలం గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నేటికీ కల్వర్టు నిర్మాణం ప్రారంభించలేదు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలతో పాటు వందలాది భారీ వాహనాలు కూడా రాకపోకలు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యామ్నాయంగా చేపట్టిన కల్వర్టు నిర్మాణం పూర్తిచేయకుండా ఏడాది కాలం నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరయ్యాయి

> కల్వర్టు నిర్మాణం నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక పంపించడంతో రూ.76లక్షలు నిధులు మంజూరయ్యాయి. త్వరలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేసి మరికొద్ది రోజుల్లో కల్వర్టు నిర్మాణం చేపట్టనున్నాం.
> – రామచంద్రరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, పార్వతీపురం

చెరకు నాటే పనుల్లో రైతులు



వెంకటాపురంలో బోదెలపై వేస్తున్న చెరకు విత్తనం ముక్కలు



బూర్జలో పొలంలో నాటిన చెరకు విత్తనం

సీతానగరం: మండలంలో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడం, అరకొరగా ఉపాధి పనులు కల్పించడంతో నీటి వనరులున్న గ్రామాల్లో రైతులు చెరకు నిత్తనం నాటే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ప్రాంతంలో రైతులు ఖరీఫ్ వరిపంట ఇళ్లకు చేరుకున్న తరువాత మట్టి నమూనాలు చేసిన భూముల్లో చెరకు విత్తనం వేసే పనులు చేపట్టారు. ఉపాధి పనులు సక్రమంగా కల్పించక పోవడంతో పనుల్లేక ప్రత్యామ్నాయంగా ఉన్న కొద్దిపాటి భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు.

మోడల్ ప్రైమరీ స్కూల్‌తో మెరుగైన విద్య



ఎస్ఎంసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 సామల

బలిజిపేట: మోడల్ ప్రైమరీ పాఠశాలలతో మరింత మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు మండలంలోని పలగర పంచాయతీ గుడివాడ కాలనీ ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ సమావేశంలో శుక్రవారం పాల్గొన్న మాట్లాడుతూ ఇక్కడ ఉండే పాఠశాలను ఎత్తివేయకుండా 1,2తరగతులను ఇక్కడ నిర్వహించి 3వ తరగతి నుంచి మోడల్ ప్రైమరీ పాఠశాలకు తరలించనున్నామని తెలిపారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటారని తరగతుల వారీగా నిర్వహణ ఉంటుందని చెప్పారు. పాఠశాల వద్ద మంచి మౌలిక సదుపాయాల కల్పన ఉంటుందని, విద్యార్థుల భవిషత్‌కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నకుమారి, కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం



మాట్లాడుతున్న బడితోట జిల్లా డైరెక్టర్ శివాజీ

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంతో బడి తోట కార్యక్రమం ద్వారా పాఠశాలల ఆవరణలో పండించిన కూరగాయలు విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని బడితోట జిల్లా డైరెక్టర్ శివాజీ అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని మిర్తివలస రెగ్యులర్ పాఠశాలను ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బడితోటలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు ఏవిధంగా పండుతున్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. దీనికి విద్యార్థులు స్పందించి బాగా పండుతున్నాయని, రసాయన ఎరువులు లేకుండా పండిస్తున్నామని, వాటిని మాకు మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తున్నారని తెలిపారు. దీనిపై ఆయన సంతృప్తి చెంది ఇదేవిధంగా మీ ఇంటివద్ద పండించేలా తల్లిదండ్రులకు సూచించాలన్నారు. కార్యక్రమంలో తోటపల్లి జట్టు ఆశ్రమ సభ్యుడు నూకంనాయుడు, ప్రకృతి వ్యవసాయ మండలశాఖ ఇన్‌చార్జ్ తిరుపతిరావు, ఉపాధ్యాయులు ధనుంజయరావు, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులూ వార్డుల్లో ఒక్కసారి తిరగండి

- మున్సిపల్ సమావేశంలో సభ్యులు



అక్రమ నిర్మాణాలపై టీపీఓను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్‌లు

సాలూరు: మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులు ఒక్కసారి వార్డుల్లో తిరిగితే ప్రజలు బాధలు అర్థమవుతాయని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు వాపోయారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. పట్టణంలో అక్రమ నిర్మాణాలు అధికమవతున్నాయని 24వ వార్డులో మెయిన్‌రోడ్డు వద్ద వైభవ్ జ్యూయలర్స్ షాపు భవన నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని టౌన్‌ప్లానింగ్ అధికారిణి ఝాన్సీని సభ్యులు నిలదీశారు.

అక్కడ పార్కింగ్ స్థలం లేదని, ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినా అగ్నిమాపక వాహనం వెళ్లే అవకాశం లేదని , ఒక్క ఫ్లోర్ నిర్మాణానికి అనుమతి తీసుకుని మూడంతస్తులు నిర్మాణం చేస్తే మీరేం చేస్తున్నారని టీపీఓను కౌన్సిలర్‌లు హైమ, గిరిరఘు, వంగపండు అప్పలనాయుడు తదితరులు నిలదీశారు. త్వరలో శ్యామలాంబ పండుగ జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు, బి.శ్రీనివాసరావు, సింగారపు ఈశ్వరరావు తదితరులు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గొర్లె జగన్‌మోహన్‌రావు, అధికారులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

పార్వతీపురం రూరల్: ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధిహామీ పథకం పనులు, చెల్లింపులపై 17వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి. వెంకటరమణ మూర్తి శుక్రవారం తెలిపారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సామాజిక తనిఖీలకు సంబంధించిన విషయాలపై ప్రజావేదికలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు

వేసవి ఎద్దడిని నివారించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం టౌన్: జిల్లాలో వేసవి ఎద్దడిని నివారించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేసవి ఎద్దడి ప్రారంభమైందని, ముందస్తు ప్రణాళికల వైఫల్యం కారణంగా పలుచోట్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్వతీపురం మండలంలోని డీకె.పట్టణం, తాళ్లబురిడి గ్రామాల్లో తాగునీటిసమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బలిజిపేట మండలంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిరసుపిల్లి సాయి శ్రీనివాస్, కోలా కిరణ్, టి.గౌరి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఛైర్మన్‌గా ముఖి సూర్యనారాయణ

సాలూరు: సాలూరు ఏఎంసీ ఛైర్మన్‌గా పాచిపెంట మండలం మాతుమూరుకు చెందిన ముఖి సూర్యనారాయణ నియామకం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణను పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం అభినందించారు.

జోరుగా బెల్టుదందా

- గ్రామాల్లో షాపులకు మద్యం తరలింపు



బలిజిపేటలో వైన్‌షాపు వద్ద ఆటోలో ఎక్కిస్తున్న మద్యం సీసాల పార్సిల్స్

బలిజిపేట: మండలంలో సిండికేట్ ప్రాబల్యంతో గ్రామాల్లో బెల్టు దందా జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో పోలీసులు మాటు వేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకునేవారని ఇప్పుడు అటువైపు చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ సంగతి వేరే చెప్పాల్సిన అవసరం లేదని, వారి ఆశీస్సులతోనే బెల్టుదందా సజావుగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు తార్కాణంగా కొన్ని గ్రామాల్లో బెల్టుపాటలు ఏర్పాటుచేసుకుని విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లైసెన్స్ షాపుల నుంచి బెల్టుషాపులకు ఒక సీసాకు రూ.20నుంచి 30వరకు అధికంగా వేసి విక్రయిస్తున్నారని, గ్రామాల్లో బెల్టుషాపుల వారు ఒక సీసాకు రూ.50అదనంగా వేసి విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసిన అక్రమాలు

- బాధ్యుల దగ్గర రికవరీకి పీడీ ఆదేశం

పాచిపెంట: మండలంలో ఉపాధి హామీ పథకం కింద 2023-24 సంవత్సరాల్లో జరిగిన పనులకు సంబంధించి మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మొత్తం 28 పంచాయతీలకు గాను 24 పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల బిల్లుల చెల్లింపుల్లో కూలీల సంతకాలు వేలిముద్రలు లేకుండా డబ్బులు జమ చేసినట్లు అధికారుల పరిశీలనలో వెలుగుచూసింది. అలాగే ఉపాధి పథకం ద్వారా లబ్ధిదారులకు అందించిన మొక్కలు సగానికి పైగా చనిపోవడంతో వాటికి సంబంధించిన డబ్బులు కూడా రికవరీ చేస్తున్నట్లు పీడీ రామచంద్రరావు స్పష్టం చేశారు. రికవరీతోపాటు ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన పొరపాట్లకు ఫైన్ కూడా విధించనున్నట్లు తెలిపారు. బాధ్యులైన టెక్నికల్ అసిస్టెంట్‌లు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ ఎంత అన్నది తర్వాత తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీవీజే పాత్రో, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లనిర్మాణాలు చేపట్టాలి



ఇళ్లనిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఈ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో గల కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం ఇస్తామన్న అదనపు ఆర్థిక సహాయంతో పూర్తి చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని అధికారులు కోరారు. ఈ మేరకు సీతానగరం మండలం సూరంపేట పంచాయతీ చిన్నారాయుడుపేట, మరిపివలస, సూరంపేట గ్రామాలలో ఇళ్లనిర్మాణాలను తహసీల్దార్ ప్రసన్నకుమార్, హౌసింగ్ ఏఈ జానకీరాంతో కలిపి ఎంపీడీఓ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయంతో పాటు అదనంగా రూ.50 వేల నుంచి రూ.70 వేలు ప్రభుత్వం ఇస్తుందని ప్రకటించారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడం వల్ల సొంతింటి కల నెరవేర్చుకునేందుకు బిల్లులు చెల్లించాలని కోరారు. పనులు ప్రారంభించిన వెంటనే బిల్లులు పెట్టడానికి సత్వరచర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు. అనంతరం అధికారుల బృందం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులు, సోక్ పిట్‌లు, గోశాలల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గిరిజన చిత్రలేఖనంలో ఐటీడీఏకు ప్రథమ స్థానం

- విద్యార్థులను అభినందించిన కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: విశాఖపట్నంలో బుధవారం జరిగిన జన్ జాతీయ గౌరవ దివస్ గిరిజన స్వాభిమాన్ వేడుకలు-2025లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన చిత్రలేఖనం, కళల విభాగంలో పార్వతీపురం ఐటీడీఏకు ప్రథమ స్థానం వచ్చింది. దీంతో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన చాంబర్‌లో విద్యార్థులను అభినందించారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్న మండంగి బాలచంద్రుడు రూ.10వేల నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి పొందిన టిక్కబాయి గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి హారిక రాజేష్ రూ.5 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, అలాగే ప్రత్యేక బహుమతిగా హారిక గౌతమ్ రూ.1,000 నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం, కన్సొలేషన్ బహుమతిగా కురుపాం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి హారిక అన్వితకు రూ.1,000 నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం రావడం ఆనందంగా ఉందంటూ కలెక్టర్ ప్రసంశించారు.

ఎలిఫెంట్ జోన్ వద్దు

- కలెక్టరేట్ వద్ద సీపీఎం నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయికులు

పార్వతీపురంటౌన్: ఎలిఫెంట్ జోన్ కారణంగా సీతానగరం మండల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడతారని సీపీఎం నాయకుడు ఆర్. ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు సీతానగం మండలంలోని అమ్మాదేవి కొండపై ఏనుగులను తెచ్చి పెట్టడం సరైన ఆలోచన కాదన్నారు. ఈ ప్రాంత ప్రజలకు తీవ్రమైన సమస్యగా మారుతుందని ఏనుగులను అటవీ ప్రాంతానికి గానీ, ఏనుగుల సంరక్షణకేంద్రానికి గానీ తరలించాలని డిమాండ్ చేశారు. జిల్లా నడిబొడ్డులో గల సీతానగరం మండలంలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం. కృష్ణమూర్తి, సుబ్బారావమ్మ, రమణమూర్తి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై విద్యార్థినులకు అవగాహన తప్పనిసరి



స్వీయరక్షణపై అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్



స్వీయ రక్షణపై అవగాహన కల్పిస్తున్న రూరల్ పోలీస్‌సిబ్బంది

పార్వతీపురం టౌన్: స్వీయ రక్షణపై విద్యార్థినులకు అవగాహన తప్పనిసరి అని శక్తి టీమ్ ఏఎస్సై శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వీయ రక్షణపై విద్యార్థినులకు పూర్తిస్థాయి అవగాహన కంటే ఆపద సమయాల్లో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థినుల మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ ఉంటే ఆపద సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శక్తియాప్ ఎస్ఓఎస్ బటన్ టచ్ చేస్తే క్షణాల్లో పోలీసు బృందం తక్షణమే చేరుకుని రక్షణగా నిలుస్తారని చెప్పారు. రాత్రి సమయాల్లో మహిళలు బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా శక్తి యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రభాకరరావు, నిర్మల, చైతన్య దేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణకు కరాటే శిక్షణ

పార్వతీపురం రూరల్: ఆపద కాలంలో స్వీయ రక్షణ ప్రతి ఒక్కరికీ అవసరమని తనకు తాను ధైర్యంగా ఉంటేనే విద్యార్థులు, మహిళలు ఆగంతుకుల బారినుంచి సురక్షితంగా తప్పించుకోగలరని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని ఎమ్మార్‌నగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూరల్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటేపై శుక్రవారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అత్యవసర సమయాల్లో సరైన ఆలోచన, ఆత్మస్థైర్యం విద్యార్థి దశనుంచే అలవర్చుకోవాలని దీనికి సంబంధించి విద్యార్థులు కరాటే, తైక్వాండో వంటి శిక్షణలు పొందాలని ఎస్సై సంతోషి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిక్షణ నిమిత్తం జిల్లాకు వచ్చిన ఎస్సైలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలి

- జిల్లావ్యాప్తంగా సీపీఎం నిరసనలు



పార్వతీపురం: పాతబస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



సాలూరు: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



బలిజిపేట: చిలకలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ స్మార్ట్‌మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలో గల పాతబస్టాండ్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీవీ రమణ, జీవీ రమణ, పాకల సన్యాసిరావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు భిన్నంగా ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపారని విమర్శించారు. 2020-2024 మధ్య కాలంలో వినియోగించిన విద్యుత్ సుంకం చార్జీలను ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.16వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడడం దుర్మార్గమైన చర్య అన్నారు. గతంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన టీడీపీ ఇప్పుడు అమల్లోకి తేవడం ఏమాత్రం సమంజసమని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ ఖరీదు రూ.26వేల భారాన్ని కూడా వినియోగదారులే భరించాలనే నిబంధన విధించారని, తక్షణమే ఈ వ్యవస్థను రద్దు చేసి పెంచిన ట్రూఅప్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ ఆలోచన మారనట్‌లైతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూరిబాబు, భానుమూర్తి, రాము, సింహాచలం, చంద్రశేఖర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దుచేయాలి

సాలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారం వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్త నిరసనలలో భాగంగా సాలూరు పట్టణంలోని మెయిన్ రోడ్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్‌వైనాయుడు, పార్టీ నాయకులు తనూజ్, శంకర్, ఈశ్వరరావు, రాముడు, రామారావు, గంగమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం రద్దుచేయాలి

బలిజిపేట: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న భారాన్ని తక్షణమే రద్దుచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బలిజిపేట మండలంలోని చిలకలపల్లి